BALAGAM TV
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ బుధవారం 14 జనవరి 2026 | www.balagamtv.com | పేజీలు 4



పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు
భోగి శుభాకాంక్షలు
- బలగం టీవి సీఈఓ బాలు కాయితి

# మున్సిపల్ ఎన్నికలకు అంతా సిద్ధం..

- మున్సిపల్ ఎన్నికల తుది ఓటర్ల జాబితా విడుదల
- 117 మున్సిపాలిటీలు, 6 కార్పొరేషన్ల ఎన్నికలకు రంగం సిద్ధం
- పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికం
- నిజామాబాద్ కార్పొరేషన్‌లో అత్యధిక ఓటర్లు
- రిజర్వేషన్ల ఖరారు తర్వాత నోటిఫికేషన్
- పురపాలక శాఖ కసరత్తు ముమ్మరం
- పట్టణ ఎన్నికల్లో కీలకంగా మారనున్న రిజర్వేషన్లు




**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం తుది ఓటర్ల జాబితాను ప్రకటించింది. ఎన్నికలు జరగనున్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో మొత్తం 52,43,023 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించింది. వీరిలో 25,62,369 మంది పురుష ఓటర్లు, 26,80,014 మంది మహిళా ఓటర్లు, 640 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఉన్నారు. పట్టణ స్థానిక సంస్థల్లో పురుషుల కంటే మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉండటం విశేషం.

కార్పొరేషన్ల వారీగా చూస్తే నిజామాబాద్ కార్పొరేషన్‌లో అత్యధికంగా 3,48,051 మంది ఓటర్లు ఉండగా, కొత్తగూడెం కార్పొరేషన్‌లో అత్యల్పంగా 1,34,775 మంది ఓటర్లు ఉన్నారు. మున్సిపాలిటీల్లో ఆదిలాబాద్ మున్సిపాలిటీలో అత్యధికంగా 1,43,655 మంది ఓటర్లు ఉండగా, అమరచింత మున్సిపాలిటీలో అత్యల్పంగా 9,147 మంది ఓటర్లు ఉన్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది. తెలంగాణ వ్యాప్తంగా మున్సిపాలిటీల్లో ఓటర్ల మ్యాపింగ్ పూర్తి అయినట్టుగా కూడా రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది. మొత్తం 117 మున్సిపాలిటీలు, 6 మున్సిపల్ కార్పొరేషన్లలో 2,996 వార్డులు ఉన్నట్టుగా పేర్కొంది.

ఇదిలా ఉండగా, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పురపాలక శాఖ కసరత్తు ముమ్మరం చేసింది. రిజర్వేషన్లు ఖరారైన అనంతరం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. జనాభా ప్రాతిపదికన వార్డులు, డివిజన్లు, ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల రిజర్వేషన్లను ఖరారు చేయనున్నారు. మొత్తం ఎన్నికల ప్రక్రియలో రిజర్వేషన్ల ఖరారు అత్యంత కీలకమైన అంశంగా ఉండటంతో, దీనిని సకాలంలో పూర్తిచేయడానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. రాష్ట్రంలో గడువు ముగిసిన 117 మున్సిపాలిటీలు, 6 కార్పొరేషన్ల ఎన్నికలకు ఇప్పటికే రంగం సిద్ధమైంది.

# రెండేళ్లలో 9572 ఉద్యోగాలు భర్తీ



- మరో 7267 ఉద్యోగాల భర్తీ చివరి దశలో ఉంది
- త్వరలో మరిన్ని నోటిఫికేషన్లు ఇస్తాం
- ప్రభుత్వ హాస్పిటళ్లలో ప్రతి పోస్టునూ రిక్రూట్ చేస్తాం
- ప్రతి పౌరునికి మెరుగైన వైద్య సేవలు అందిస్తాం
- ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ
- ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగాలకు ఎంపికైన 1257 మందికి నియామక పత్రాల అందజేత

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ చరిత్రలో మరో భారీ నియామక ప్రక్రియ పూర్తయింది. ఒకేసారి 1,257 మంది ల్యాబ్ టెక్నీషియన్లకు (గ్రేడ్-2) నియామక పత్రాలను అందజేసే బృహత్తర కార్యక్రమం మంగళవారం కోటిలోని ఉస్మానియా మెడికల్ కాలేజీ గ్రౌండ్స్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ.. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్‌లతో కలిసి అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా వేగంగా ఈ నియామక ప్రక్రియను పూర్తి చేశామన్నారు. 2024 సెప్టెంబర్ 11న నోటిఫికేషన్ విడుదల చేయగా, 2025 నవంబర్ నాటికి నియామక ప్రక్రియను పూర్తి చేశామన్నారు. మొత్తం 23,323 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకాగా, 1257 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని మంత్రి తెలిపారు. డీఎంఈ పరిధిలో 764, డీపీహెచ్‌లో 300, టీవీవీపీలో 180, ఎంఎన్‌జేలో 13 మందికి పోస్టింగ్స్ ఇచ్చామన్నారు.

“ఒకప్పుడు రోగి లక్షణాలను బట్టి వైద్యం చేసేవారు. కానీ నేడు రోగ నిర్ధారణ జరిగిన తర్వాతే చికిత్స ప్రారంభిస్తున్నారు. ల్యాబ్ టెక్నీషియన్లు ఇచ్చే రిపోర్టులే డాక్టర్లకు ప్రామాణికం. వైద్య వ్యవస్థకు మీరు కళ్లు, చెవుల్లాంటి వారు. మీ రిపోర్టుల్లో కచ్చితత్వం ఎంతో ముఖ్యం. ఎన్ఏబీఎల్ ప్రమాణాలకు అనుగుణంగా ప్రభుత్వ ల్యాబ్స్‌ను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ల్యాబ్ టెక్నీషియన్లు తీసుకోవాలి” అని మంత్రి పేర్కొన్నారు.

**రెండేళ్లలో 9572 ఉద్యోగాల భర్తీ**

నిరుద్యోగుల ఆకాంక్షలను నెరవేరుస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం గత రెండేళ్లలో 70 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేసిందని మంత్రి గుర్తుచేశారు. ఒక్క ఆరోగ్య శాఖలోనే ఇప్పటివరకు 9,572 పోస్టులను భర్తీ చేశామని, మరో 7,267 పోస్టుల నియామక ప్రక్రియ వివిధ దశల్లో

ఉందని తెలిపారు. ఆర్థిక శాఖ అనుమతి ఉన్న మరో 996 పోస్టులకు త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేస్తామని, అదనంగా 2,344 పోస్టుల భర్తీకి ప్రతిపాదనలు పంపామని మంత్రి స్పష్టం చేశారు.

**ఆరోగ్య తెలంగాణ లక్ష్యం**

తెలంగాణను ఆరోగ్య రాష్ట్రంగా మార్చేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని మంత్రి పేర్కొన్నారు. ఉస్మానియా నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన, ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంపు, ప్రతీ జిల్లాలో ఎన్‌సీడీ క్లినిక్స్, క్యాన్సర్ డే కేర్ సెంటర్లు, ట్రాన్స్‌జెండర్ల కోసం మైత్రి క్లినిక్స్, గాంధీ ఆసుపత్రిలో ఉచిత ఐవీఎఫ్ సేవలు అందుబాటులోకి తెచ్చామని వివరించారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్‌ను సెకండరీ హెల్త్ కేర్‌గా మారుస్తున్నామని మంత్రి వెల్లడించారు.

త్వరలోనే నూతన హెల్త్ పాలసీని రూపొందించి, అమలు చేయబోతున్నామని మంత్రి తెలిపారు. ప్రజలకు సేవ చేసే అవకాశం ఉన్న ఆరోగ్యశాఖను సీఎం రేవంత్ రెడ్డి తనకు ఇచ్చారని, ఈ శాఖకు మంత్రిగా ఉన్నందుకు తనకు చాలా ఆనందంగా ఉందని మంత్రి వెల్లడించారు. కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, స్థానిక కార్పొరేటర్ సురేఖ ఓం ప్రకాష్ , వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తు ,ఇతర అధికారులు పాల్గొన్నారు.

# తుది దశకు సమ్మక్క-సారలమ్మ జాతర పనులు



- మేడారం జాతరకు దాదాపు రెండు కోట్ల మంది భక్తులు
- జనవరి 18న మేడారంలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన
- మేడారంలోనే రాష్ట్ర కేబినెట్ సమావేశం
- భక్తుల కోసం వెబ్‌సైట్, మొబైల్ యాప్, వాట్సాప్ సేవలు
- అన్ని సేవలకు ఒకే నంబర్ 7658912300
- మంత్రి సీతక్క

**బలగం టీవి, మేడారం**

ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరొందిన సమ్మక్క--సారలమ్మ మహా మేడారం జాతర ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. ఆ తల్లుల దర్శనం కోసం అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వస్తారని, ఈసారి దాదాపు రెండు కోట్ల మంది భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో అన్ని శాఖల సమన్వయంతో పనులు చేపట్టినట్లు వెల్లడించారు. మంగళవారం మేడారంలో జరుగుతున్న ఏర్పాట్లను మంత్రి సీతక్క పరిశీలించారు.

అనంతరం ఆమె మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సమ్మక్క--సారలమ్మ తల్లులతో ఎంతో భావోద్వేగ బంధం ఉందని గుర్తు చేశారు. అందుకే రూ.260 కోట్ల వ్యయంతో మేడారం అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. జనవరి 18న మేడారంలో దేవాలయ ప్రారంభానికి సీఎం రేవంత్ రెడ్డి రానున్నారని, అదే రోజు అక్కడే రాష్ట్ర కేబినెట్ సమావేశం కూడా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆ రోజు రాష్ట్ర ప్రభుత్వమే మేడారం తరలి వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.మేడారానికి వచ్చే భక్తులకు త్వరితగతిన అమ్మవార్ల దర్శనం జరిగేలా చర్యలు తీసుకోవాలని దేవాలయ అధికారులను మంత్రి ఆదేశించారు. సంప్రదాయ భక్తులు కనీసం మూడు రోజుల పాటు మేడారంలోనే బస చేస్తారని, అందుకు తగిన వసతులన్నీ కల్పించాల్సి ఉందని స్పష్టం చేశారు. రవాణా, తాగునీరు, శానిటేషన్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

అలాగే ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ప్రణాళికతో పని చేయాలని పోలీసులను ఆదేశించారు. సామాన్య భక్తులు ఎక్కువగా ఆర్టీసీ బస్సుల్లోనే మేడారానికి వస్తారని, ఈ మార్గాల్లో నడిచే బస్సులపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆర్టీసీ ఉన్నతాధికారులకు సూచించారు. సమ్మక్క--సారలమ్మ మహా మేడారం జాతరను దృష్టిలో పెట్టుకుని ముందస్తుగానే అన్ని చర్యలు పూర్తి చేశామని మంత్రి సీతక్క తెలిపారు.

**అన్ని సేవలకు ఒకే నంబర్**

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మేడారం జాతర అధికారిక వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. అలాగే మేడారం వాట్సాప్ చాట్‌బాట్‌తో పాటు ప్రత్యేక మొబైల్ యాప్‌ను విడుదల చేశారు. భక్తుల సౌకర్యార్థం హెల్త్ క్యాంపులు, టాయిలెట్ బాక్సులు, రూట్ మ్యాప్‌లు, ట్రాఫిక్ అప్‌డేట్‌లు, సహాయ కేంద్రాల ఫోన్ నంబర్లు, ఫిర్యాదుల నమోదు, తాగునీటి సౌకర్యం వంటి సమగ్ర సమాచారం కోసం వాట్సాప్ నంబర్ 7658912300ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు మంత్రి వివరించారు.

## ముఖ్యమంత్రి ఫొటోల మార్ఫింగ్‌పై సిట్ ఏర్పాటు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

నారాయణపేట జిల్లా మద్దూర్, హైదరాబాద్ సీసీఎస్‌లో నమోదైన రెండు కీలక కేసుల దర్యాప్తుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేసింది. హైదరాబాద్ సీపీ సజ్జనార్ నేతృత్వంలో ఎనిమిది మంది సభ్యులతో సిట్‌ను ఏర్పాటు చేస్తూ డీజీపీ శివధర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కావలి వెంకటేశ్ అనే వ్యక్తి ముఖ్యమంత్రి ఫొటోలను అసభ్యకరంగా రూపొందించి వాట్సప్ గ్రూపులో పోస్ట్ చేశాడు. ఈ ఘటనపై కాంగ్రెస్ నేత గూళ్ల నరసింహ ఫిర్యాదు మేరకు ఈనెల 11న కేసు నమోదు చేశారు. ఈ కేసు సిట్ పరిధిలోకి తీసుకున్నారు.

ఇదిలా ఉండగా, మహిళా ఐఏఎస్ అధికారిని కించపరుస్తూ వార్తలను ప్రచారం చేసిన వ్యవహారంపై హైదరాబాద్ సీసీఎస్‌లో మరో కేసు నమోదైంది. ఐఏఎస్ అధికారుల సంఘం ఫిర్యాదు మేరకు రెండు తెలుగు న్యూస్ ఛానళ్లతో పాటు ఏడు యూట్యూబ్ ఛానళ్లపై బీఎన్ఎస్ 75, 78, 79, 351(1), 351(2) సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ రెండు కేసులపై సిట్ సమగ్రంగా దర్యాప్తు చేయనుంది.

**సిట్ సభ్యులు వీరే:**

నార్త్ రేంజ్ జాయింట్ సీపీ శ్వేత, చేవెళ్ల డీసీపీ యోగేశ్ గౌతమ్, హైదరాబాద్ అడ్మిన్ డీసీపీ వెంకటలక్ష్మి, సైబర్ క్రైమ్ డీసీపీ అరవింద్ బాబు, విజిలెన్స్ అదనపు ఎస్పీ ప్రతాప్, సీసీఎస్ ఏసీపీ గురు రాఘవేంద్ర, సైబర్‌సెల్ ఇన్‌స్పెక్టర్ శంకర్‌రెడ్డి, సైబర్‌సెల్ ఎస్సై హరీశ్.

## మేడారం జాతరకు నేడు అంకురార్పణ

**బలగం టీవి, మేడారం**

మేడారం జాతరకు బుధవారం జరుగనున్న గుడిమెలిగె పండుగతో అంకురార్పణ జరుగనుంది. జాతరకు సరిగ్గా 15 రోజుల ముందు ఈ పండుగ ప్రారంభమవుతుంది. బుధవారం సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజులు, పడిగిద్దరాజుల దేవాలయాలను పూజారులు శుద్ధి చేసి పవిత్ర పరుస్తారు. ఆదివాసీ సంప్రదాయబద్ధంగా బుధవారం పూజారులు, వారి కుటుంబ సభ్యులు వారి ఇండ్లలో శుద్ధి కార్యక్రమం నిర్వహించాక కొత్త బట్టలు ధరించి ఆదివాసీ వాయిద్యాలతో ఆలయాలకు బయలుదేరుతారు. కన్నెపల్లిలో సారలమ్మ ఆలయం, మేడారంలో సమ్మక్క ఆలయం, కొండాయిలో గోవిందరాజుల ఆలయం, కొత్తగూడ మండలం పూనుగొండ్లలో పగిడిద్దరాజు ఆలయంలో అలికి, రంగు, రంగుల ముగ్గులు వేసి తీర్చిదిద్దుతారు. మేడారంలో అమ్మవార్ల గద్దెలు, ప్రాంగణాన్ని శుద్ధి చేసి అలికి ముగ్గులు వేస్తారు. ఈ 15 రోజులు అమ్మవార్ల గద్దెలను శుభ్రంగా వుంచి జాతరకు సన్నద్ధమవుతారు. దీంతో వన దేవతలను గద్దెలకు ఆహ్వానించే ప్రక్రియ మొదలవుతుంది. గుడిమెలిగె పండుగ అంటే మేడారం జాతర ప్రారంభానికి సంకేతంగా భావిస్తారు. పూర్వం అమ్మవార్ల దేవాలయాలకు బదులు గుడిసెలే వుండేవి. ఆ గుడిసెలకే మండమెలిగి కొత్త కప్పును వేసేవారు. ఆచార వ్యవహారంగా పూర్వం నుంచి ఇప్పటి వరకు ఇదే తంతు కొనసాగుతోంది. గుడిమెలిగె పండుగతోనే అమ్మవార్లను అడవి నుంచి గద్దెలకు ఆహ్వానించే ప్రక్రియ ప్రారంభమవుతుంది.

# ధాన్యం కొనుగోళ్లలో రికార్డు

- రాష్ట్ర ప్రభుత్వం ఈ సీజన్‌లో 70.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది
- రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో ఖరీఫ్ 2025-26 సీజన్‌లో ధాన్యం కొనుగోలులో చారిత్రక రికార్డు నెలకొన్నది. రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించినట్లుగా, ఈ సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం 70.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. గత రికార్డు 70.2 లక్షల మెట్రిక్ టన్నులలఅబశ్రీశ్రీను ఈ సీజన్ అధిగమించింది.


రాష్ట్ర పౌర సరఫరా, నీటిపారుదల శాఖల సమన్వయం, తెలంగాణా రైతాంగం భాగస్వామ్యం కారణంగా ఈ రికార్డు సాధ్యమైందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. మొత్తం కొనుగోలు ధాన్యంలో 32.45 లక్షల మెట్రిక్ టన్నులు దొడ్డు రకం, 38.37 లక్షల మెట్రిక్ టన్నులు సన్నా రకం ఉన్నాయని వివరించారు.

ఈ కొనుగోలు ప్రక్రియ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 13.97 లక్షల మంది రైతులకు మద్దతు ధర అందజేయబడింది. మొత్తం కొనుగోలు ధర రూ.16,912 కోట్లు, ఇందులో ఇప్పటివరకు రూ.16,602 కోట్లు చెల్లించబడ్డాయని మంత్రి వెల్లడించారు. సన్నా ధాన్యాన్ని పండించిన రైతుల ఖాతాల్లో ప్రత్యేకంగా 500 బోనస్‌లు జమ చేయబడినట్లు చెప్పారు. ఇప్పటి వరకు ఈ బోనస్ రూ.1,425 కోట్లు రైతుల ఖాతాల్లో చెల్లించబడింది.

ధాన్యం కొనుగోలులో విజయవంతమైన రికార్డు సాధించడంలో 8,448 కొనుగోలు కేంద్రాలు, అధికార యంత్రాంగం క్షేత్రస్థాయి పర్యవేక్షణ కీలకంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. ధాన్యం సంపదకు సంక్రాంతి ప్రతీకగా నిలిచే ఈ సందర్భంలో తెలంగాణా రైతాంగానికి, రాష్ట్ర ప్రజలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. రైతుల కృషిని గుర్తించి, వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అనుసరిస్తున్న అనుకూల విధానాలు ఈ విజయానికి ప్రధాన కారణమని ఆయన పేర్కొన్నారు.

## అట్టహాసంగా ప్రారంభమైన
# అంతర్జాతీయ పతంగుల, మిఠాయిల పండుగ

- సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ఇలాంటి వేడుకలు అవసరం : మంత్రి జూపల్లి



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

నగరంలోని పరేడ్ గ్రౌండ్స్‌లో అంతర్జాతీయ పతంగుల, మిఠాయిల పండుగ మంగళవారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు.. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి ఈ వేడుకలను ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, శతాబ్దాల చరిత్ర కలిగిన పతంగుల పండుగ, మన సంస్కృతి, సంప్రదాయాల సంరక్షణ కోసం ప్రభుత్వం ఇలాంటి ఉత్సవాలను నిర్వహిస్తోందని తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా వివిధ దేశాల, రాష్ట్రాల నుండి తరలివచ్చి ఎగురవేస్తున్న రంగురంగుల పతంగులు ఆకాశాన్ని మురిపిస్తున్నాయని పేర్కొన్నారు. తన చిన్నతనంలో పతంగులు ఎగురవేసిన మధుర జ్ఞాపకాలను ఆయన ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.గాలిపటాల తయారీని హైదరాబాద్‌లోనే పెద్ద ఎత్తున ప్రోత్సహించడం ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెంచే ప్రయత్నం చేస్తామని మంత్రి తెలిపారు. పర్యాటక రంగ అభివృద్ధి ద్వారా రాష్ట్ర ఆదాయాన్ని పెంచడంతో పాటు, నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.ప్రజలు తమ బిజీ జీవితంలో కనీసం నెలకు రెండు రోజులైనా పర్యాటక ప్రదేశాలను సందర్శించాలి. దీనివల్ల మానసిక ఉల్లాసంతో పాటు, స్థానిక కళాకారులకు, వ్యాపారులకు ఆర్థికంగా చేయూత లభిస్తుంది” అని మంత్రి పిలుపునిచ్చారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఫెస్టివల్‌ను ప్రజలందరూ సందర్శించి విజయవంతం చేయాలని కోరుతూ, అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.



అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన వివిధ రాష్ట్రాల మిఠాయిల స్టాళ్లను మంత్రి జూపల్లి సందర్శించి, రుచులను ఆస్వాదించారు. ఈ కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, పర్యాటక అభివృద్ధి సంస్థ ఎం.డి క్రాంతి వల్లూరి, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నర్సింహ రెడ్డి, హెరిటేజ్ డైరెక్టర్ అర్జున్ రావు, కైట్ ఫెస్టివల్ కన్సల్టెంట్ పవన్ డి సోలంకి, క్లిక్ (జూక్ష్మిజఖ) ప్రతినిధులు లింబీ బెంజిమన్, పరమానంద శర్మ , అభిజిత్, తదితరులు పాల్గొన్నారు.

## '10 నిమిషాల్లో డెలివరీ'పై నిషేధం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

డెలివరీ బాయ్స్ భద్రతను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కార్మిక మంత్రిత్వ శాఖ 10 నిమిషాల్లో డెలివరీ చేసే విధానంపై నిషేధం విధించింది. ఈ అంశంపై స్విగ్గీ, జొమాటో, బ్లింకిట్, జెప్టో వంటి ప్రముఖ ఆన్‌లైన్ డెలివరీ సంస్థలతో ప్రభుత్వం చర్చలు జరిపింది. కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ ఈ కంపెనీల అధికారులతో సమావేశమై, వేగవంతమైన డెలివరీ పేరుతో డెలివరీ బాయ్స్‌పై అనవసర ఒత్తిడి పెరుగుతోందని, వారి ప్రాణ భద్రతకు ఇది ముప్పుగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. డెలివరీ సమయానికి పరిమితులు విధించడం తొలగించాలని కంపెనీలను కోరారు. ప్రభుత్వ సూచనలకు స్పందించిన అన్ని డెలివరీ సంస్థలు తమ బ్రాండ్ ప్రకటనలు, సోషల్ మీడియా ప్రచారాల్లో డెలివరీ సమయ పరిమితులను తొలగిస్తామని హామీ ఇచ్చాయి. ఈ నిర్ణయం అనంతరం బ్లింకిట్ తన అన్ని ప్లాట్‌ఫారమ్‌ల నుంచి 10 నిమిషాల డెలివరీ ఫీచర్‌ను పూర్తిగా తొలగించినట్లు ప్రకటించింది.

## ముఖ్యమంత్రికి కనీస రాజ్యాంగ స్ఫూర్తి, అవగాహన లేదు : దాసోజు

**బలగం టీవీ, హైదరాబాద్**

ట్రాఫిక్ చలాన్‌లను ఆటోడెబిట్ విధానంలో నేరుగా ప్రజల బ్యాంకు ఖాతాల నుంచి వసూలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పోలీసులకు సూచించడంపై బీఆర్ఎస్ సీనియర్ నేత, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రికి కనీస రాజ్యాంగ స్ఫూర్తి, అవగాహన లేదని ఆయన విమర్శించారు. ముఖ్యమంత్రి మాట అంటే ఆదేశమని, అలాంటి ఆదేశాలకు చట్టబద్ధత, నియమనిబద్ధత తప్పనిసరిగా ఉండాలని శ్రవణ్ అన్నారు. సీఎం స్థాయి వ్యక్తి ఏదిపడితే అది మాట్లాడటం సరికాదని, అలా మాట్లాడితే చివరకు ఆ వ్యక్తి జోకర్‌గా మిగిలిపోతారని వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డి జోకర్‌లా ఎందుకు మాట్లాడుతున్నారో అర్థం కావడంలేదని, అది ఆయన అహంకారమా, అజ్ఞానమా, లేక అమాయకత్వమా తెలియడం లేదని ఎద్దేవా చేశారు.అధికారంలోకి వస్తే ట్రాఫిక్ చలాన్‌లపై 50 శాతం డిస్కౌంట్ ఇస్తామని హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి, ఇప్పుడు నేరుగా బ్యాంకు ఖాతాల నుంచి ఆటోడెబిట్ ద్వారా చలాన్‌లు వసూలు చేయాలని సూచించడం దారుణమని శ్రవణ్ మండిపడ్డారు. ఆటోడెబిట్ విధానంలో చలాన్‌ల వసూలు నిర్ణయంతో సీఎం విచ్చలవిడి అవినీతి, దోపిడీకి తెరలేపుతున్నారని ఆయన ఆరోపించారు.

# బీఆర్ఎస్ పని అయిపోయింది



- ఏ జిల్లానూ తొలగించబోము
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ పార్టీకి భవిష్యత్తు లేదని, గతం మాత్రమే ఉంది అని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మీడియాతో తెలిపారు. ఇవాళ గాంధీ భవన్‌లో ఆయన రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులు, జిల్లాల పునర్విభజన వంటి అంశాలపై మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్‌లో కీలక వ్యాఖ్యలు చేశారు. మాజీ ఎమ్మెల్సీ కవిత చేస్తున్న వ్యాఖ్యలకు బీఆర్ఎస్ దగ్గర సమాధానం లేదని, దీనికి బట్టి ఆ పార్టీలో అంతర్గత గందరగోళం స్పష్టమవుతున్నదని. ప్రజలు పార్టీపై పెద్ద ఎత్తున అక్రమాలు జరిగిందని బలంగా నమ్ముతున్నారని, అందుకే ఆ పార్టీని దూరం పెడుతున్నారు అని విమర్శించారు.

ప్రస్తుతం తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశంలో మరే రాష్ట్రంలో లేవని, ప్రజల అవసరాలకు అనుగుణంగా తమ 'ప్రజా ప్రభుత్వం' ముందుకు వెళ్తోందని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ రెబల్స్ లేకుండా పకడ్బందీగా వ్యవహరిస్తామని, ఇతర పార్టీల నుంచి వచ్చిన నియోజకవర్గాల్లో పాత నాయకులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన జిల్లాల విభజన అశాస్త్రీయంగా ఉందని ఆయన విమర్శించారు. ప్రస్తుతం ఉన్న జిల్లాల్లో ఏ ఒక్క జిల్లాను తొలగించే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. జిల్లా పునర్విభజనపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి, జిల్లాల సరిహద్దులు, విభజనపై శాస్త్రీయ మార్పులు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నారని వెల్లడించారు.

సీఎం మంత్రుల శాఖల్లో జోక్యం చేసుకోకూడదని మంత్రి కోమటిరెడ్డి చేసిన వ్యాఖ్యలను సమర్థిస్తున్నట్లు, పాలనను ప్రజల వద్దకు తీసుకెళ్లడంలో భాగంగా హైదరాబాద్ బయట కేబినెట్ సమావేశం పెట్టడం శుభ పరిణామమని అన్నారు. భూభారతిలో అవినీతి జరిగితే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు. తాజాగా, కార్పొరేషన్ చైర్మన్ల పదవులను త్వరలో భర్తీ చేయనున్నట్లు, డిమాండ్ అధికంగా ఉండటంతో వడపోత జరుగుతోందని తెలిపారు. ఇక తెలంగాణ నీటి వాటా విషయంలో కూడా ఏ విధమైన రాజీపడే ప్రసక్తే లేదని టీపీసీసీ చీఫ్ అన్నారు.



## కొత్తకొండ వీరభద్ర స్వామి ఆలయ అభివృద్ధికి ప్రత్యేక కృషి

- కేంద్ర మంత్రి బండి సంజయ్

**బలగం టీవీ, హైదరాబాద్**

కొత్తకొండ వీరభద్ర స్వామి ఆలయ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తరపున ప్రత్యేక కృషి చేస్తానని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు. మంగళవారం ఆయన కొత్తకొండలోని వీరభద్ర స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన బండి సంజయ్ కోరిన కోరికలు నెరవేరాలని కోడె మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రకృతితో ముడిపడి ఉన్న సంక్రాంతి పండుగను ప్రజలంతా ఆనందంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. కోర మీసాల వీరభద్ర స్వామి సమాజాన్ని నాశనం చేయాలని ప్రయత్నించే శక్తుల భరతం పట్టే దేవుడని పేర్కొన్నారు. చెడు ఆలోచనలు కలిగిన వారిలో మార్పు తీసుకురావడంలో స్వామి వీరభద్రుడి కృప అపారమని తెలిపారు. దేశం సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ అశోక్ ముఖర్జీ, ఆలయ ఈవో కిషన్ రావు, డైరెక్టర్లు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

## బెట్టింగ్ యాప్ బారిన పడి యువకుడి ఆత్మహత్య

**బలగం టీవీ, నిజామాబాద్**

ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల మాయలో పడి మరో యువకుడు ప్రాణాలు కోల్పోయిన ఘటన నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం కూనెపల్లిలో చోటుచేసుకుంది. 22 ఏళ్ల సంజయ్ ఆన్‌లైన్‌లో బెట్టింగ్ ఆడేందుకు భారీగా అప్పులు చేయగా, వాటిని తీర్చాలనే ఒత్తిడి తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బెట్టింగ్ కోసం పెద్ద మొత్తంలో అప్పులు చేసిన విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిస్తే మందలిస్తారనే భయంతో సంజయ్ తీవ్ర మానసిక ఆందోళనకు గురయ్యాడు. చివరకు గత్యంతరం లేక బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటనతో సంజయ్ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. సంజయ్ మృతిపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్ట్‌మార్టం నిమిత్తం నిజామాబాద్ జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## వీర్నపల్లి పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



గర్భిణీలకు ఏఎన్సీ చెకప్ లపై ప్రత్యేక దృష్టి సారించాలని, వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్ సీ)లో మంగళవారం ఇంచార్జి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఓపీ, వైద్యులు, సిబ్బంది హాజరు రిజిస్టర్ తనిఖీ చేశారు. ఏ.ఎన్.సీ నమోదు, ఎన్.సీ.డీ స్క్రీనింగ్ టెస్టులపై ఆరా తీశారు. వ్యాక్సిన్ గది, ల్యాబ్, ఫార్మసీ, తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ప్రభుత్వ వైద్యశాలల్లోనే ప్రసవాలు, చికిత్స పొందేలా వైద్య సిబ్బంది క్షేత స్థాయిలో గర్భిణీ స్త్రీల ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రతపై వివరించి అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.



## తంగళ్ళపల్లిలో ఘనంగా జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు..

- హెల్మెట్ ధరించడం ప్రాణరక్షణకు మార్గం: డీటీఓ లక్ష్మణ్

**బలగం టీవీ, తంగళ్ళపల్లి:**

వాహనదారుల అజాగ్రత్త మరియు నిర్లక్ష్యం వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించి తమ ప్రాణాలను కాపాడుకోవాలని జిల్లా రవాణా అధికారి (డీటీఓ) లక్ష్మణ్ పిలుపునిచ్చారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని తాడూరు చౌరస్తాలో డ్రైవర్లు మరియు ప్రజలకు రోడ్డు నియమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రోడ్డు నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తామని వాహనదారులతో ప్రతిజ్ఞ చేయించారు. రోడ్డు ప్రమాదాల వల్ల ఎన్నో కుటుంబాలు వీధిన పడుతున్నాయని డీటీఓ ఆవేదన వ్యక్తం చేశారు. వాహనదారులు క్రమశిక్షణతో వాహనాలను నడిపితే ప్రమాదాలను పూర్తిగా నివారించవచ్చని ఆయన పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో 'నో హెల్మెట్ -- నో పెట్రోల్' విధానాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామని, దీనిని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఏ మెంబర్ సంగీతం శ్రీనాథ్, ఏఎంవీఐ రజినీ దేవి, సిరిసిల్ల అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ ఇన్చార్జ్ చుక్క రాజశేఖర్, ఆర్టీఏ సిబ్బందితో పాటు పెద్ద సంఖ్యలో ట్రాక్టర్ మరియు ఆటో డ్రైవర్లు, స్థానిక యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇండ్ల నిర్మాణాలు పరిశీలించిన ఇన్‌చార్జి కలెక్టర్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో సమావేశం నిర్వహించాలని, పనుల్లో వేగం పెంచాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వీర్నపల్లి మండల కేంద్రంలో లెంకల దివ్య, మహమ్మద్ నూర్జహ, మహమ్మద్ రేష్మా, ఎర్రగడ్డ తండాలో మాలోత్ విజయ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను మంగళవారం పరిశీలించారు. ఇండ్ల నిర్మాణాలను ఎప్పుడు మొదలు పెట్టారు? ప్రభుత్వ ఆర్థిక సహాయం అందుతుందా? అనే విషయాలపై ఆరా తీశారు.

ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా.. ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని వినియోగించుకునేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. స్లాబ్ దశలో ఉన్న ఇండ్లు అన్ని ఈ నెల ఆఖరులోగా పూర్తి చేసి గృహ ప్రవేశానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. లబ్దిదారులకు ఇంటి నిర్మాణంలో అవసరమైన సామాగ్రి అందించాలని హౌసింగ్, మండల పరిషత్ అధికారులకు సూచించారు. మొత్తం 226 ఇండ్లు మంజూరు చేయగా, 170 ఇండ్లకు ముగ్గు పోశారు. 132 ఇండ్లు బేస్ మెంట్ లెవెల్ లో, 70 ఇండ్లు గోడల లెవెల్ లో, 49 ఇండ్లు స్లాబ్ లెవెల్ లో ఉన్నాయని హౌసింగ్ అధికారులు ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ దృష్టికి తీసుకువెళ్లారు. ఒక ప్రణాళిక ప్రకారం బేస్ మెంట్ లెవెల్ లో ఉన్న ఇండ్లు, గోడల లెవెల్ కు, గోడల లెవెల్ లో ఉన్న ఇండ్లు స్లాబ్ లెవెల్ కు.. స్లాబ్ లెవెల్ లో ఉన్న ఇండ్లు పూర్తి చేసేలా పనులు చేయించాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు పూర్తి అయిన ఇండ్ల వివరాలను ఆన్లైన్ చేయించాలని, ఇండ్ల నిర్మాణాలను హౌసింగ్, మండల పరిషత్ అధికారులు నిత్యం తనిఖీ చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో హౌసింగ్ పీడీ శంకర్, డీఈ ముజఫర్, తహసీల్దార్ ముక్తార్ పాషా, ఎంపీడీఓ శ్రీ లేఖ, హౌసింగ్ ఏఈలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సైన్స్ ఫేయిర్‌లో విద్యార్థుల ప్రతిభ..

- జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ అభినందన.

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**




శాస్త్ర సాంకేతిక రంగాల్లో జిల్లా విద్యార్థులు తమ అసాధారణ ప్రతిభతో జాతీయ స్థాయిలో మెరిశారు. ఇన్స్పైర్ మానక్ , రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్ పోటీల్లో రాణించిన విద్యార్థులను జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా నుంచి మొత్తం ఏడు ప్రాజెక్టులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవ్వడం గర్వకారణమని పేర్కొన్నారు. ముఖ్యంగా రక్షణ రంగానికి సంబంధించిన ప్రాజెక్టులు రూపొందించిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు, వారిని ఇస్రో (శ్రీహరికోట) సందర్శనకు తీసుకెళ్లేలా ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్యను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా విద్యాధికారి వినోద్, జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ స్మైల్ పకడ్బందీగా నిర్వహిద్దాం..



- 18 సంవత్సరాలలోపు పిల్లలను పనిలో పెట్టుకుని వారితో పని చేయిస్తున్న వారిపై 3 కేసులు నమోదు..
- అదనపు ఎస్పీ చంద్రయ్య.

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

గడిచిన 13 రోజుల్లో జిల్లాలో 28 మంది పిల్లలను రెస్క్యూ చేసి సిడబ్ల్యూసి ముందు హాజరుపరచగా తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి అప్పగించడం జరిగింది. మంగళవారం రోజున జిల్లా పోలీస్ కార్యలయంలో అపరేషన్ స్మైల్ టీమ్, వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి జిల్లాలో ఉన్న పరిశ్రమలు, హెూటల్స్ , వ్యాపార సముదాయాలు, గోదాములు, మెకానిక్ షాపులు, హెూటల్స్, ఇటుక బట్టిలు తదితర ప్రాంతాల్లో వ్యూహాత్మక ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి ఆపరేషన్ స్మైల్ పకడ్బందీగా నిర్వహించాలని అదనపు ఎస్పీ ఆదేశించారు.

ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి కేంద్ర ప్రభుత్వం సంవత్సరంలో రెండు సార్లు ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ అనే కార్యక్రమాలను నిర్వహించి తప్పిపోయిన బాలలను గుర్తించి వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చేలా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగా జిల్లాలో ఆపరేషన్ స్మైల్ విజయవంతం కోసం అన్ని శాఖల సమన్వయంతో పకడ్బందీగా నిర్వహిస్తున్నామని,గడిచిన 13 రోజులలో ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థలను గుర్తించి విస్తృతంగా తనిఖీలు నిర్వహించి జిల్లా వ్యాప్తంగా 28 మంది పిల్లలని గుర్తించి వారి యొక్క తల్లిదండ్రుల వద్దకు చేర్చడం జరిగిందని, 18 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకుని వారితో పని చేయిస్తున్న వారిపై 03 కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో డీడబ్ల్యూఓ లక్ష్మీ రాజాం, సీడబ్ల్యూసీ చైర్పర్సన్ అంజయ్య, ఎస్.ఐ లు ఎల్లగౌడ్, లక్ష్మతి, మెడికల్ అండ్ హెల్త్ నుండి నయుమ్ జహార్, ఏ ఏఎస్ఐ ప్రమీల, మహిళా కానిస్టేబుల్స్ శ్రీలత, ప్రియాంక, కానిస్టేబుల్స్ గంగరాజం, శ్రీనివాస్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## డైరీ, దైనందినిని ఆవిష్కరించిన రాజన్న సిరిసిల్ల జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**




తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ డైరీని రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమా అగ్రవాల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డైరీ తో పాటు 2026 దైనందిని, సంవత్సరంలో విడుదలైన అన్ని ప్రభుత్వ జీవోలతో టీపీటీఎఫ్ ప్రత్యేకంగా ముద్రించిన బుక్ ను వారికి టీపీటీఎఫ్ బాధ్యులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. పదవ తరగతి ఉత్తీర్ణతలో జిల్లా రాష్ట్రంలోనే అత్యుత్తమ స్థానంలో ఉండాలని కోరారు. అంతే కాకుండా పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో అందరం కలిసికట్టుగా పని చేద్దామని వారు తెలియజేశారు. ఈ సందర్భంగా సమగ్ర సర్వే నిర్వహించిన సిబ్బందికి గౌరవ వేతనం రాలేదని కలెక్టర్ కి తెలియజేయగా చాలా జిల్లాలకు రాలేదని కొన్ని జిల్లాలకు అందాయని మన జిల్లాకు కూడా బడ్జెట్ అలాట్మెంట్ కాగానే సర్వే నిర్వహించిన సిబ్బంది ఖాతాలలో జమ చేస్తామని తెలియజేశారు. వివిధ విద్యారంగ సమస్యల పరిష్కారం కొరకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి చర్చిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫ్రూఖీ జిల్లా అధ్యక్షులు దుమాల రమనాధ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వికృర్తి అంజయ్య, జిల్లా ఉపాధ్యక్షులు మందాడి శ్రీనివాసరెడ్డి, నూగురి దేవేందర్, జిల్లా కార్యదర్శి చకినాల రామచంద్రం, వేములవాడ మండలం అధ్యక్షులు బొజ్జ కృష్ణ, తంగళ్ళపల్లి మండల అధ్యక్షులు బండి ఉపేందర్, రూరల్ మండలం అధ్యక్షులు శ్రీనివాస్, జిల్లా కౌన్సిలర్ చకినాల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ రెండేళ్లలో నయాపైసా అయినా ఇచ్చిందా..?

- సీఎం రేవంత్ రెడ్డి మాటకారి
- 6 డీఏలు పెండింగ్ లో ఉంటే రాష్ట్రంలో ఆర్థిక మాంద్యం ఉన్నట్లు అంగీకరించాలి
- అమృత్ కింద రూ.104 కోట్లు సిరిసిల్ల మున్సిపాలిటీకి ఇస్తే ఏం చేశారు?
- 14,15వ ఆర్థిక సంఘంతోపాటు మౌలిక సదుపాయాల కింద కేంద్రం రూ.30 కోట్లు ఇచ్చింది
- హైదరాబాద్, కరీంనగర్ కార్పొరేషన్లలో కాషాయ జెండా ఎగరేస్తాం
- కేంద్ర సహాయ హెూంశాఖ మంత్రి బండి సంజయ్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



సిరిసిల్ల పట్టణంలో బీజేపీ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ పాల్గొన్నారు. సిరిసిల్ల నుండి మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. సోమవారం రోజు సిరిసిల్ల పట్టణం విచ్చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ స్థానిక శాంతినగర్ లో బీజేపీ జెండాను ఆవిష్కరించి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా కేంద్ర సహాయ హెూంశాఖ మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విధిలేక రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఒక డీఏ ప్రకటించారే తప్ప వారిపట్ల ప్రేమ లేదని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. “రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఇప్పటికే 5 డీఏలు ఇయ్యలేదు. ఈ నెలతో 6 డీఏలు పెండింగ్ లో ఉన్నట్లు. ఏ రాష్ట్రంలోనైనా ఉద్యోగులకు 6 డీఏలు ఇయ్యకుండా పెండింగ్ లో పెడితేఆ రాష్ట్రంలో ఆర్థిక మాంద్యం ఉన్నట్లు లెక్క. అంటే రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉందని అంగీకరించాల్సి ఉంటది. ఈ అంశంపై ఎవరైనా కోర్టుకు పోతే ప్రభుత్వానికి కష్టం. మొత్తం 6 డీఏలు చెల్లించాల్సిన పరిస్థితి వస్తుంది. ఇది తెలిసే ఒక డీఏ ఇచ్చి ఆ పరిస్థితి నుండి తప్పించుకున్నారే తప్ప ఆయన ఉద్యోగులకు ఒరగబెట్టిందేమీ లేదు”అని చెప్పారు.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లయింది. 6 గ్యారంటీలు అమలయ్యాయా? మహిళలకు నెలకు రూ.2500లు ఇస్తున్నారా? స్కూటీ ఇచ్చారా? వృద్దులకు నెలకు 4 వేల పెన్షన్ ఇస్తున్నారా? నిరుద్యోగులకు రూ.4 వేల భృతి ఇస్తున్నారా? 2 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఒక్కరికైనా ఇల్లు ఇచ్చారా? ఏ ఒక్క హామీ ఇవ్వని కాంగ్రెస్ కు ఓట్లేస్తారా? ఓటుకు రూ.5 వేలు ఇచ్చి ఓట్లు వేయించుకోవాలని కాంగ్రెస్ చూస్తోంది? ఓట్లేస్తారా? ఆలోచించండి. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఇచ్చిన హామీలను అమలు చేశారా? సిరిసిల్ల మున్సిపాలిటీ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం 14, 15 ఆర్థిక సంఘం నిధులతోపాటు రోడ్లు, ఇతర సౌకర్యాల కోసం రూ.30 కోట్ల నిధులిచ్చింది. అట్లాగే అమ్రుత్ పథకం కింద రూ.104 కోట్ల నిధులిచ్చింది. మరి ఆ నిధులను ఏం చేశారు? పోనీ కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో సిరిసిల్ల మున్సిపాలిటీకి నయాపైసా అయినా ఇచ్చిందా? సమాధానం చెప్పాలని అన్నారు.

కేంద్రం ఇంత పెద్ద ఎత్తున నిధులిస్తే.. ఎన్నడైనా కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలకులు మోదీ ప్రభుత్వం పైసలిచ్చిందని చెప్పారా? లేదౌ పైగా అడుగుడుగునా బీజేపీ నేతలను ఇబ్బంది పెట్టడం, అక్రమ అరెస్టులు చేయడం తప్ప వారు సాధించిందేమిటి? ఇండ్లు ఇచ్చేది కేంద్రం, పైసలు తెచ్చేది మేమే. ఆ పార్టీలకు ఓట్లేస్తే ప్రయోజనం ఏముంది? ఆలోచించండని అన్నారు. కేంద్రం నిధులిస్తే సక్రమంగా ఖర్చు చేయకుండా అభివృద్ధి చేయకపోవడంవల్ల వర్షం వస్తే సిరిసిల్ల పట్టణం మునిగిపోయే పరిస్థితి ఏర్పడింది. చివరకు కలెక్టరేట్ కూడా మునిగిపోయిన దుస్థితిని చూసినం. మున్సిపాలిటీ ఎన్నికల్లో బీజేపీకి ఓట్లేసి గెలిపించాలని కోరుతున్నా.కాంగ్రెస్, బీఆర్ఎస్ ఇచ్చే పైసలకు అమ్ముడుపోయి ఓట్లేస్తే 5 ఏళ్లు నరకం తప్పదు. సిరిసిల్ల మున్సిపాలిటీని మాకు అప్పగిస్తే అభివృద్ధి ఏమిటో చూపిస్తాం. మమ్ముల్ని గెలిపించిన సిరిసిల్ల మున్సిపాలిటీ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు తీసుకొస్తాం. రాష్ట్రంలో, మున్సిపాలిటీలో బీజేపీకి అధికారం లేకపోయినా పెద్ద ఎత్తున సైకిళ్లను పంపిణీ చేసినం. ప్రభుత్వ ఆసుపత్రులకు కోట్ల రూపాయల మెడికల్ ఎక్విప్ మెంట్స్ ఇచ్చిన. వివిధ రూపాల్లో నిధులు ఖర్చు చేస్తున్నా. మున్సిపాలిటీ ఎన్నికల్లో పువ్వు గుర్తుకు ఓట్లేసి గెలిపిస్తే అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తా. పువ్వు గుర్తుకు ఓట్లేస్తే ‘లక్ష్మీ దేవి’ మీ ఇంటికి వస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం మెడలు వంచి నిధులు తీసుకొస్తా అని తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెద్ద మాటకారి, ఉద్యోగస్తులకు ఇయాళ ఒక డీఏ ప్రకటించారు. అసలు విషయం ఏమిటంటే ఇప్పటికే 5 డీఏలు పెండింగ్ లో ఉన్నాయి. ఈ నెలతో 6 డీఏలు పెండింగ్ లో ఉన్నట్లు. ఇదే జరిగితే రాష్ట్రంలో ఆర్థిక మాంద్యం ఉన్నట్లు లెక్క. అంటే రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉందని అంగీకరించాల్సి ఉంటది. ఈ అంశంపై ఎవరైనా కోర్టుకు పోతే ప్రభుత్వానికి కష్టం. మొత్తం 6 డీఏలు చెల్లించాల్సిన పరిస్థితి వస్తుంది. ఇది తెలిసే ఒక డీఏ ప్రకటించారే తప్ప ఉద్యోగులపై సీఎంకు ప్రత్యేక ప్రేమ లేదు. బ్యాంకు అకౌంట్లు ఉన్న ఉద్యోగులకు రూ.కోటి ప్రమాద బీమా ఉంది. నిజంగా ప్రభుత్వం ప్రమాద బీమా ప్రకటిస్తే బడ్జెట్లో ఎన్ని నిధులు కేటాయించారో సమాధానం చెప్పాలి. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన పైసలు, దాచుకున్న సొమ్మును కూడా చెల్లించడం చేతగాని కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులపట్ల ప్రేమ ఒలకపోస్తుందంటే నమ్మేదెలా? అని అన్నారు.బీఆర్ఎస్ పార్టీ కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో లేదు. కేంద్రంలో ఒక్క ఎంపీ గెలవలేదు. ఆ పార్టీకి ఓట్లేస్తే డ్రైనేజీలో వేసినట్లే. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ పార్టీకి క్యాండిడేట్ కూడా దిక్కులేదు. బీఆర్ఎస్ పార్టీలో ఎమ్మెల్యేలు ఉంటారో ఉండరో తెల్వని పరిస్థితి. బిడ్డ ఒక దిక్కు, కొడుకు ఇంకో దిక్కు, అల్లుడు మరో దిక్కు. అసలు ఆ పార్టీ ఉంటదో ఉండదో తెల్వక కేసీఆర్ ఫాంహౌజ్ లో పడుకుని తాగుకుంట పడుకుంటున్నడు. కేసీఆర్ కన్పించేది ఆసుపత్రిలో లేదంటే ఫాంహౌజ్ లో తప్ప జనంలోకి వచ్చిందే లేదు. ఈసారి హైదరాబాద్, కరీంనగర్ కార్పొరేషన్లలో మేయర్ సీట్లు కైవసం చేసుకోవడంతోపాటు సిరిసిల్ల, వేములవాడసహా అనేక మున్సిపాలిటీల్లో ఛైర్మన్ స్థానాలు సాధించబోయేది బీజేపీయేనని స్పష్టం చేశారు.

# అంతర్జాతీయ హాకీ ప్రపంచ కప్ క్వాలిఫయర్స్-2026 పోస్టర్‌ను ఆవిష్కరించిన సీఎం.



**బలగం టీవీ, హైదరాబాద్:**

అంతర్జాతీయ హాకీ ప్రపంచ కప్ క్వాలిఫయర్స్--2026 పోస్టర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, అలాగే ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




# క్రీడలతో మానసిక ఉల్లాసం..

- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రాజన్న సిరిసిల్ల జిల్లా టీచర్స్ ప్రీమియం లీగ్ సీజన్ 5 ప్రారంభోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్య బోధించే ఉపాధ్యాయలు క్రీడల పట్ల మక్కువతో దివంగత మంకు రాజయ్య యాదిలో క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. గతంలో పాఠశాలల్లో గంట పాటు అటల పోటీలకు ప్రత్యేక పీరియడ్ ఉండేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల్తో ఫ్రెండ్లిగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎంతో కాలం నుండి ఎదురు చూస్తున్న టీచర్ల ప్రమోషన్స్ ఇవ్వడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సుమారు 11 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశారని మరో మారు డిఎస్సీ కోసం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. గతంలో జీతాలు నెల మధ్యలో వచ్చేవని కానీ నేడు నెల మొదటి తేదీన వేతనాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, సిరిసిల్ల పట్టణంలో క్రీడాకారుల కోసం 5 ఎకరాల స్థలం కేటాయించామని తెలిపారు. ఎల్లపుడూ క్రీడాకారులకు తన వంతు సహాయ సహారాలు ఉంటాయని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడాలకు పెద్ద పీట వేస్తున్నరని అందులో భాగంగా రాష్ట్రంలో క్రీడా యూనివర్సిటీని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనీ క్రీడాకారులను వెలికి తీయడానికి సీఎం కప్ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# వివాదాస్పదంగా మారిన ఎమ్మెల్యే గడ్డం వినోద్ తీరు

**బలగం టీవీ, బెల్లంపల్లి:**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గంలో అధికార పార్టీ ఎమ్మెల్యే గడ్డం వినోద్ తీరు వివాదాస్పదంగా మారింది. ప్రజా సమస్యలను ప్రశ్నించిన విలేకర్లపై ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడటమే కాకుండా, బూతు పురాణం అందుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. తన అనుచరుడి బెదిరింపులను తప్పుబట్టాల్సింది పోయి, విలేకర్లనే బెదిరించాడని ఆరోపణలు రావడం ఇప్పుడు చర్చనీయాంశమైంది.

ఇటీవల బెల్లంపల్లి ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడు రాంచందర్ భూకబ్జాలకు పాల్పడుతున్నారంటూ ఒక విలేకరి వార్త రాశారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన రాంచందర్ సదరు విలేకరికి ఫోన్ చేసి, అత్యంత దారుణమైన పదజాలంతో దూషించారు. “బెల్లంపల్లిలో ఎలా తిరుగుతావో.. ఎలా బ్రతికి ఉంటావో చూస్తా” అంటూ ప్రాణహాని తలపెట్టేలా బెదిరింపులకు దిగారు. ఈ ఘటనను నిరసిస్తూ, విలేకరిని బెదిరించిన రాంచందర్‌పై చర్యలు తీసుకోవాలని మరియు అతడిని పార్టీ నుండి బహిష్కరించాలని కోరుతూ స్థానిక విలేకర్లు నిరసనకు దిగారు. నిరసన తెలుపుతున్న విలేకర్ల వద్దకు వచ్చిన ఎమ్మెల్యే గడ్డం వినోద్, వారి సమస్యను పరిష్కరించాల్సింది పోయి ఎదురుదాడికి దిగారని తెలిసింది. ఇటీవల ఎమ్మెల్యే కారును ర్యాష్‌గా డ్రైవ్ చేస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీనిపై విలేకర్లు ప్రశ్నిస్తూ.. “యువతకు మీరిచ్చే సందేశం ఇదేనా?” అని వార్తలు రాయడంపైనా ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. “అంతా నా ఇష్టం.. నా కారు, నాకు నచ్చినట్లు డ్రైవ్ చేస్తా.. ప్రశ్నించడానికి మీరెవరు?” అంటూ విలేకర్లపై ఎమ్మెల్యే విరుచుకుపడ్డారని సమాచారం. తమ అనుచరుడికి మద్దతుగా నిలుస్తూ విలేకర్లను బూతులు తిడుతూ రెచ్చిపోయారని తెలిసింది. విలేకర్ల నుంచి వినతిపత్రం తీసుకున్న ఆయన, “తరువాత పరిణామాలు ఎలా ఉంటాయో చూడండి” అంటూ హెచ్చరిక ధోరణిలో అక్కడి నుంచి వెళ్లిపోయారని కొందరు చెప్పడం కలకలం రేపుతోంది. ప్రజాస్వామ్యంలో నాల్గవ స్తంభమైన పత్రికా రంగాన్ని, విలేకర్లను అగౌరవపరచడంపై జర్నలిస్టు సంఘాలు మండిపడుతున్నాయి. ఎమ్మెల్యే మరియు ఆయన అనుచరులు సామాన్యులను, విలేకర్లను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# బాధితులకు సత్వర న్యాయం చేకూర్చాలి..

- అట్రాసిటీ కేసులు త్వరితగతిన పరిష్కరించాలి.
- జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్
- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గీతే, అధికారులతో సమీక్ష
- భీమేశ్వర, బద్ది పోచమ్మ ఆలయాల్లో పూజలు

**బలగం టీవీ, వేములవాడ:**



ఎస్సీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం చేకూర్చాలని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ ఆదేశించారు. జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ వేములవాడ పట్టణానికి సోమవారం రాగా, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గీతే, ఏఎస్పీ రుత్విక్ సాయి పుష్ప గుచ్చం అందజేసి స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా భీమేశ్వర ఆలయ సమీపంలోని అతిథి గృహంలో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గీతే, ఏఎస్పీ రుత్విక్ సాయి, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారులతో జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ వివిధ పథకాలు, అట్రాసిటీ కేసులు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ మాట్లాడుతూ.. ఎస్సీ అట్రాసిటీ కేసుల్లో ఎంక్వైరీ వేగంగా పూర్తి చేసి చార్జీ షీట్ వేస్తే బాధితులకు న్యాయంతో పాటు ప్రభుత్వ నిబంధనల మేరకు పరిహారం అందుతుందన్నారు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఎస్టీ పథకాల ప్రయోజనాలు అందిపుచ్చుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. వారి సమస్యలను జిల్లా యంత్రాంగానికి తెలియజేసేలా చూడాలని ఆదేశించారు. జిల్లాలోని ఎస్సీ సంక్షేమ హాస్టళ్లలో ఎంత మంది విద్యార్థులు చదువుతున్నారు? మెనూ, అంబేద్కర్ ఓవర్సీస్ విదేశీ విద్యా నిధి, కులాంతర వివాహాలకు ప్రోత్సాహకం పై ఆరా తీశారు. కులాంతర వివాహాలకు ఇటీవల ఇద్దరికి రూ. 2 లక్షల 50 వేల ఫిక్స్ బాండ్ లు అందజేశామని, అంబేద్కర్ ఓవర్సీస్ విదేశీ విద్యా నిధి కింద ఎనిమిది మంది విద్యార్థులకు ఒక్కొకరికి రూ.20 లక్షల చొప్పున మొత్తం రూ. 1కోటి 80 లక్షలు లబ్ధిదారులకు అందించామని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడి దృష్టికి తీసుకువెళ్లారు. అన్ని ఎస్సీ సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాలయాల్లో ప్రభుత్వ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెడుతున్నామని, కాస్మొటిక్ చార్జెస్, యూనిఫాం, బుక్స్ అందిస్తున్నామని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ రమాదేవి, ఏఎస్పీ రుత్విక్ సాయి, వేములవాడ ఆర్డీఓ రాధాభాయ్, తహసీల్దార్ విజయ ప్రకాశ్ రావు,



## సిరిసిల్ల మున్సిపాలిటీ ఓటర్ల తుది జాబితా విడుదల

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

సిరిసిల్ల పురపాలక సంఘం పరిధిలోని 39 వార్డులకు సంబంధించిన తుది ఓటర్ల జాబితాను అధికారులు సోమవారం విడుదల చేశారు. ఈ జాబితాను ప్రజల పరిశీలనార్థం మున్సిపల్ కార్యాలయ నోటీస్ బోర్డుపై ప్రచురించారు. ప్రచురించబడిన తుది జాబితా ప్రకారం పట్టణంలోని ఓటర్ల వివరాలు..

| వర్గం | ఓటర్ల సంఖ్య |
|---|---|
| మొత్తం ఓటర్లు | 81,959 |
| పురుషులు | 39,942 |
| మహిళలు | 42,011 |
| ఇతరులు | 06 |


**తేది 01.01.2026 రోజున విడుదల చేసిన 39 వార్డుల ముసాయిదా**

ఓటర్ల జాబితా పైన (47) అభ్యంతరాలు / దరఖాస్తులు రాగా వాటిలో (12) జుక్ష్మఉ గారు, (37) మున్సిపల్ సిబ్బందిచే నిర్దిష్ట గడువులోపు పరిష్కారించి, ఈరోజు తుది జాబితా రూపొందించడం జరిగిందని, ఇట్టి తుది జాబితను ప్రజల పరిశీలనార్థం జిల్లా కలెక్టరేటు కార్యాలయం, రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయశీ, తహసిల్దార్ కార్యాలయము మరియు మున్సిపల్ కార్యాలయంలో ఉంచబడినని మరియు రాష్ట్ర ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు తుది జాబితా పంపిణీ చేయబడునని తెలియజేయడమైనది. పట్టణ ఓటర్లు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని కోరడమైనదని ఒక ప్రకటనలో తెలిపారు

## కేటీఆర్‌కు మరో అంతర్జాతీయ గౌరవం.

### న్యూయార్క్‌లోని కొలంబియా బిజినెస్ స్కూల్‌లో ప్రసంగించాలని ఆహ్వానం

**బలగం టీవీ, హైదరాబాద్:**



మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్?) కు అంతర్జాతీయ స్థాయిలో మరో ప్రతిష్టాత్మక ఆహ్వానం లభించింది. మంత్రిగా ఆయన హయాంలో చేసిన అసాధారణ కృషిని, తెలంగాణను ప్రపంచ పటంలో సమున్నత స్థాయిలో నిలిపిన తీరును గుర్తిస్తూ, అంతర్జాతీయ వేదికలపై తన ఆలోచనలను పంచుకోవాల్సిందిగా ఆయనకు ఆహ్వానం అందింది. సాంకేతికత, పాలన, సుస్థిర అభివృద్ధి, పట్టణ అభివృద్ధి మరియు ఆర్థిక వృద్ధిపై ఆయనకున్న లోతైన అవగాహన ప్రపంచవ్యాప్తంగా విద్యా, విధాన నిర్ణేత మరియు వ్యాపార వేదికలపై బలమైన ముద్ర వేసింది. ఈ క్రమంలో, న్యూయార్క్ నగరంలోని కొలంబియా బిజినెస్ స్కూల్ (జదీూ)లో ఏప్రిల్ 4, 2026న జరగనున్న '21వ వార్షిక ఇండియా బిజినెస్ కాన్ఫరెన్ణ (క్ష్మీదీజ)లో ప్రసంగించాలని కేటీఆర్‌కు ఆహ్వానం అందించింది. ఈ సదస్సును నిర్వహించే విద్యార్థి విభాగం 'సౌత్ ఆసియా బిజినెస్ అసోసియేషన్ణ (ూూదీూ) ఈ మేరకు ఆయనను ఆహ్వానించింది.

భారతదేశ వ్యాపార, ఆవిష్కరణ మరియు విధాన నిర్ణయ రంగాలపై మేధోమథనం జరిగే ప్రపంచంలోని అత్యున్నత వేదికలలో 'ఇండియా బిజినెస్ కాన్ఫరెన్ణ ఒకటి. గత 21 ఏళ్లుగా న్యూయార్క్‌లో నిర్వహిస్తున్న ఈ సదస్సు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారతదేశం పోషిస్తున్న పాత్రపై చర్చించేందుకు ప్రభుత్వం, పరిశ్రమలు, విద్యాసంస్థలు మరియు ప్రవాస భారతీయులకు ఒక వేదికగా నిలుస్తోంది. 2026 ఎడిషన్ కాన్ఫరెన్స్‌లో 'జెరోధా' వ్యవస్థాపకులు నిఖిల్ కామత్ ప్రధాన వక్తగా వ్యవహరించనున్నారు. గతంలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్, పాలో ఆల్టో నెట్‌వర్క్స్ సీఈఓ నికేష్ అరోరా, డ్రీమ్ 11 సహ వ్యవస్థాపకులు హర్ష్ జైన్ వంటి ప్రముఖులు ఈ వేదికపై ప్రసంగించారు. ఇటీవలే హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో జరిగే 'హార్వర్డ్ ఇండియా కాన్ఫరెన్ణకు ఆహ్వానం అందిన తరుణంలోనే, ఇప్పుడు కొలంబియా బిజినెస్ స్కూల్ నుండి కూడా ఆహ్వానం రావడం విశేషం. కేటీఆర్ నాయకత్వం మరియు విజన్ పట్ల అంతర్జాతీయ స్థాయిలో ఉన్న ఆసక్తికి ఇది నిదర్శనం. గత ఏడాది కూడా ఆయన ఆక్స్‌ఫర్డ్ ఇండియా వీక్ సందర్భంగా ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో ప్రసంగించి, తన స్పష్టమైన మరియు ముందుచూపుతో కూడిన ప్రసంగంతో అందరి ప్రశంసలు అందుకున్నారు. కేటీఆర్‌ను 'విశిష్ట వక్త'గా ఆహ్వానించడం తమకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రజా సేవలో ఆయన చేసిన కృషి, భారతదేశ అభివృద్ధి పథంలో ఆయన పోషించిన పాత్రను ఈ సందర్భంగా కొనియాడారు.




## యువతకు ప్రేరణగా వివేకానంద ఆలోచనలు, ఆదర్శాలు

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

స్వామి వివేకానంద ఆలోచనలు, ఆదర్శాలు యువతకు ప్రేరణగా నిలుస్తాయని, యువత క్రమశిక్షణ, నైతిక విలువలు, సేవాభావంతో ముందుకు సాగాలని సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు జూపెల్లి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంధాలయంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజన దినోత్సవంను పురస్కరించుకుని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, రాజన్న సిరిసిల్ల ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవాధికర సంస్థ అధ్యక్షురాలు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నీరజ ఆదేశాలతో సీనియర్ సివిల్ జడ్జి/కార్యదర్శి, ఋూూ పి.లక్ష్మణాచారి సమన్వయంతో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా యువతలో చట్టపరమైన అవగాహన కల్పించడం, వారి హక్కులు–బాధ్యతలపై అవగాహన పెంపొందించడం మరియు దేశ నిర్మాణంలో యువత పాత్ర ఎంత ముఖ్యమో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు, న్యాయవాదులు ఆడెపు వేణు, గుర్రం ఆంజనేయులు, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఈ.జ్యోతి, పారా లీగల్ వాలంటీర్స్ లావణ్య, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

## స్త్రీ,శిశు సంక్షేమానికి ప్రాధాన్యత..

- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- 23 వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- సీడీపీఓ భవనం ప్రారంభం



**బలగం టీవీ, వేములవాడ:**

స్త్రీ,శిశు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు..సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో వేములవాడ ప్రాజెక్టు చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ కార్యాలయ భవనాన్ని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం వేములవాడ పట్టణంలోని 23 వార్డులో 14 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను విప్ శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ఐదు మండలాలు పరిధిలో అంగన్వాడీ సిబ్బందికి అవసరమైన సౌకర్యాల కల్పన కోసం నిర్మించిన నూతన అంగన్వాడీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. అంగన్వాడీలు ఎంతో క్రమశిక్షణతో పిల్లలను తీర్చిదిద్దుతున్నారని వివరించారు. అలాగే అంగన్వాడీ టీచర్లు పూర్వ ప్రాథమిక విద్యను అందిస్తూ బాలల స్నేహపూర్వక వాతావరణం లో పిల్లల మానసిక శారీరక ఎదుగుదలకు తోడ్పడుతున్నారని తెలిపారు. బాల భరోసా అనే కార్యక్రమాన్ని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించి పిల్లలలో ఎదుగుదల లోపాలను గుర్తిస్తున్నారని తద్వారా అంగన్వాడీ టీచర్లు వైద్య ఆరోగ్యశాఖ సమన్వయంతో ముందుగా పిల్లలలో వైకల్యాలను గుర్తించి వారి అభివృద్ధికి బాటలు వేయవచ్చని వివరించారు. అలాగే శారీరక మానసిక ఎదుగుదలకు అంగన్వాడీలు చేస్తున్న సేవలు అమోఘమని గుర్తు చేశారు.

ప్రభుత్వం ద్వారా బాలామృతం పంపిణీ, గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం, ప్రతి వారం కోడిగుడ్లు వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో స్త్రీ--శిశు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ అనేక సంక్షేమ పథకాలు ముందుకు తీసుకువెళ్తున్నామని చెప్పారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు 46 కొత్త అంగన్వాడీ భవనాలకు మంజూరు లభించిందని, అదనంగా 27 పాత అంగన్వాడీ కేంద్రాలకు మరమ్మతులు చేపడుతున్నామని తెలిపారు. ఒక్కో అంగన్వాడీ భవనానికి సుమారు రూ.12 లక్షల వ్యయంతో నిర్మాణాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఎక్కడైనా నిర్మాణాల్లో జాప్యం ఉంటే అంగన్వాడీ సిబ్బంది ప్రజాప్రతినిధుల ద్వారా లేదా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

అలాగే గ్రామాల్లో మహిళా సంఘాల కోసం ఒక్కో భవనానికి రూ.10 లక్షలతో హాల్, అన్ని సదుపాయాలతో మహిళా సంఘ భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. నియోజకవర్గంలో 70 అంగన్వాడీ ఆయా ఖాళీలు, 15 అంగన్వాడీ టీచర్ ఖాళీలు ఉన్నాయని, వీటిని త్వరలోనే నోటిఫికేషన్ జారీ చేసి భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. అంగన్వాడీ కేంద్రాలను మరింత ఆకర్షణీయంగా, సమర్థవంతంగా మార్చి చిన్నారుల పోషకాహార లోపం లేకుండా చూడాల్సిన బాధ్యత అందరిదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ సౌందర్య, ఏసీడీపీఓ సుచరిత, కోఆర్డినేటర్ రోజా తదితరులు పాల్గొన్నారు.

## నో హెల్మెట్.. నో పెట్రోల్ అమలు సామాజిక బాధ్యత..

- ప్రతి పెట్రోల్ బంక్ యజమానులు అమలు చేయాలి.
- ప్రతి బంక్‌లో ఫ్లెక్సీ లు ఏర్పాటు చేయాలి.
- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్.
- రోడ్డు భద్రతా జాతీయ మాసోత్సవాల సందర్భంగా అవగాహన..
- హాజరైన ఎస్పీ మహేష్ బి గీతే



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ప్రతి పెట్రోల్ బంక్ యజమానులు సామాజిక బాధ్యతగా నో హెల్మెట్.. నో పెట్రోల్ అమలు చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. రోడ్డు భద్రతా జాతీయ మాసోత్సవాల సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లాలోని పెట్రోల్ బంక్ యజమానులతో సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. దేశంలో గత ఏడాది 4,80,000 ప్రమాదాలు జరిగాయని, దానిలో 1,70,000 మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ప్రతి రోజు రోడ్డు ప్రమాదాల్లో 20 మంది మృతి చెందుతున్నారని వివరించారు. జిల్లాలో గత ఏడాది 290 ప్రమాదాలు జరిగాయని గుర్తు చేశారు. ప్రధానంగా రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా ప్రాణ నష్టం జరిగేది ద్విచక్ర వాహన దారులేకేనని తెలిపారు. రోడ్డు ప్రమాదాల కారణంగా కుటుంబాలు వీధిన పడుతున్నాయని, వాహనదారుడు క్రమశిక్షణతో వాహనలు నడపడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించుకోవచ్చని తెలిపారు. పెట్రోల్ బంక్ యజమానులు సామాజిక బాధ్యతగా నో హెల్మెట్ నో పెట్రోల్ అమలు చేయాలని, బంక్ లలో పని చేసే సిబ్బందికి ఈ సమాచారం చేరవేసి పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు.

అనంతరం ఎస్పీ మహేష్ బి గీతే మాట్లాడుతూ.. ప్రతి బంక్ యజమానులు తమ బంక్ లో నో హెల్మెట్ .. నో పెట్రోల్ ఫ్లెక్సీలు రెండు ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణలో సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్, పౌర సరఫరాల అధికారి చంద్ర ప్రకాశ్, డీఎం రజిత తదితరులు పాల్గొన్నారు.

## డే కేర్ సెంటర్ సేవలు వృద్ధులు వినియోగించుకోవాలి.

- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- వర్చువల్ విధానంలో ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

డే కేర్ సెంటర్ సేవలను వృద్ధులు వినియోగించుకోవాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రణామ్ పేరిట ఏర్పాటు చేసిన వృద్ధుల డే కేర్ సెంటర్లను గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్చువల్ విధానంలో సోమవారం ప్రారంభించగా, సిరిసిల్ల పట్టణంలోని సుభాష్ నగర్ లో ఏర్పాటు చేసిన వృద్ధుల డే కేర్ సెంటర్ ప్రారంభోత్సవానికి ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. వృద్ధుల మానసిక ఉల్లాసం, భద్రత, సంరక్షణ లక్ష్యంగా ప్రణామ్ణ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం మల్టీ సర్వీస్ డే కేర్ సెంటర్లను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. ఈ డే కేర్ సెంటర్లలో లైబ్రరీ, ఇండోర్ గేమ్స్, టీవీ సదుపాయంతో అందుబాటులో ఉంటాయని వివరించారు. వృద్ధులకు ఉచితంగా స్నాక్స్‌తో పాటు టీ అందిస్తారని తెలిపారు. అలాగే దిన పత్రికలు, పక్ష, మాస పత్రికలు, కథల పుస్తకాలు, మ్యాగజైన్ లు ఉంటాయని వివరించారు. జిల్లా గ్రంథలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, ఐఆర్సీఎస్ జిల్లా అధ్యక్షుడు గుడ్ల రవి, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ జలపాల శంకరయ్య, జిల్లా అధ్యక్షుడు చేపూరి బుచ్చయ్య, సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.